తేగలతో గ్రామీణుల జీవనోపాధి

- ప్రకృతి వరప్రసాదం.. పోషకాలు పుష్కలం
- ఆరోగ్య సమస్యలు దూరం
- పట్టణాల్లో డిమాండ్
- 1500 మందికిపైగా ఉపాధి


తేగలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు


కావలిలో తేగలు విక్రయిస్తున్న మహిళలు

కావలి: శీతాకాలంలో లభించే తేగలకు మంచి డిమాండ్ ఉంటుంది. ప్రకృతి వరప్రసాదమైన తేగల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పలు రకాల ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపుతాయి. అందుకే వాటిని తినేందుకు అందరూ మక్కువ చూపుతుంటారు. తేగలు ఒకప్పుడు పల్లెటూర్లలోనే దొరికేవి. ప్రస్తుతం పట్టణాల్లోనూ దొరుకుతున్నాయి. పట్టణాల్లో తేగలను విక్రయిస్తూ గ్రామీణులు జీవనోపాధి పొందుతున్నారు.

తేగల తయారీ ఇలా..

తేగలు ప్రకృతి సిద్ధమైన కల్తీ లేని ఆహారం. తాటిచెట్ల కాయలు లేతగా ఉన్నప్పుడు అందులోని ముంజలను తింటారు. తాటికాయలను కోయకుండా చెట్టుకే వదిలేస్తే ముదిరిపోయి పండుతాయి. అలా పండిన కాయలను విడదీసి ఇసుక నేలల్లో గుంటలు తీసి పాతిపెడితే నెల రోజులకు మొలకెత్తుతాయి. అవే తేగలు. తేగలను కుండల్లో నీళ్ల పోసి ఉడికించడం, నిప్పుల మీద కాల్చడం, ఇసుకలో పూడ్చి పైన మంట వేసి కాల్చడం చేస్తుంటారు. ఆకులు తీసేసి వాటిపై పలచటి పొరను తొలగించి కాండాలను తింటారు. ఒకప్పుడు పిల్లలకైనా పెద్ద వాళ్లకైనా చిరుతిండి అంటే ఆయా కాలాల్లో పండేవి దొరికేవి మాత్రమే. అందులో భాగంగానే చలికాలంలో వచ్చే తేగలను ఎక్కువగా తినేవారు.

వృద్ధులకు జీవనోపాధి

ఏటా శీతాకాలంలో కావలి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత వృద్ధులు తేగల విక్రయంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లోని ఇసుక నేలల్లో తేగలు ఎక్కువగా వేస్తారు. రైతులు తమ నివాసాల వద్ద, గడ్డి వాముల వద్ద ఇసుక నేలల్లో గుంటలు చేసి వాటిలో పెద్ద ఎత్తున తాటి కాయలు వేస్తారు. నెల రోజుల తర్వాత తేగలు మొలకెత్తగానే తవ్వి తీస్తారు. వాటిని ఉడకబెట్టడం, కాల్చడం చేస్తారు. వాటిని సమీపంలో ఉండే గ్రామాలు, పట్టణాలకు తీసుకెళ్లి అమ్మకాలు చేస్తారు. కావలి నియోజకవర్గంలో మూడు మండలాలకు చెందిన సుమారు 1,500 మంది మహిళలు ఏటా నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు తేగల అమ్మకాలు చేస్తుంటారు. సాయంత్రానికి ఒక్కొక్కరు రోజుకు కనీసం రూ.500 నుంచి రూ.1,000 వరకు తేగల విక్రయం ద్వారా సంపాదిస్తుంటారు. కావలి ప్రాంతానికి చెందిన వారు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ఇతర నగరాల్లో స్థిరపడిన వారు కూడా తమ బంధువులు, కుటుంబసభ్యులు రాకపోకలు సాగిస్తున్న సందర్భాల్లో తేగలను తెప్పించుకుంటుంటారు. అలాగే ట్రాన్స్‌పోర్టు ద్వారా కూడా తెప్పించుకుంటుంటారు.

పోషకాలు పుష్కలం

తేగల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. తేగల్లో ఎక్కువగా ఉండే పీచు పదార్థం మలబద్ధకాన్ని పోగొడుతుంది. పిల్లల్లో ఎముకల పెరుగుదల, దృఢత్వానికి దోహదపడుతాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బులను దూరం చేస్తాయి. మధుమేహ వ్యాధిని నియంత్రించడానికి సహకరిస్తాయి. కాలేయానికి సంబంధించిన వ్యాధులు కూడా రాకుండా చేస్తాయి. రక్తహీనతతో బాధపడే వాళ్లకి అద్భుతమైన ఔషధంలా పనిచేస్తాయి. కేన్సర్‌ను తొలి దశలో నిర్మూలించే శక్తి తేగలకుంది. పెద్దపేగుల్లో మలినాలు చేరకుండా చేస్తాయి. తేగల్లోని సీ విటమిన్ వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. రక్తంలోని తెల్లకణాలను వృద్ధి చేస్తాయి. కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు తగ్గించడానికి సహాయపడతాయి. నరాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.

పోషకాలు పుష్కలం

తేగలు సహజ సిద్ధంగా భూమిలో పెరుగుతాయి. ప్రకృతి ప్రసాదించిన తేగల్లో ఎన్నో రకాల పోషకాలు ఉంటాయి. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చే తేగలను తినడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి.

–డాక్టర్ కామంచి సుబ్బారావు, విశ్రాంత సూపరింటెండెంట్, కావలి ఏరియా వైద్యశాల

ఇంటిల్లిపాది కష్టపడితేనే



తాటి తేగలకు శ్రమ, పెట్టుబడి ఉంటుంది. తేగల కోసం తాటి కాయలు కొనుగోలు చేస్తాం. ఇంటి వద్దనే ఇసుక నేలలో తాటి కాయలను పాతి పెడతాం. ఇంటిల్లిపాది కష్టపడితేనే తేగలు సిద్ధమవుతాయి.

–జయమ్మ, సర్వాయపాళెం, కావలి మండలం

మా పెద్దల కాలం నుంచి విక్రయిస్తున్నాం



మా పెద్దల నుంచి తేగలు అమ్మకాలు చేస్తున్నాం. ముందురోజు సాయంత్రం నుంచి పనిచేస్తేనే మరుసటి రోజు విక్రయానికి తేగలు సిద్ధమవుతాయి. నా ఒక్కదాని వల్ల తేగలు తయారు కావు. ఇంట్లోని అందరూ కలిసి పని చేస్తే నేను కావలికి తీసుకొచ్చి విక్రయిస్తాం.

–వెంకమ్మ, ఆనెమడుగు, కావలి మండలం

లేతవైతే ఉడకబెట్టి, ముదిరితే కాల్చి తెస్తాం



లేత తేగలను నిప్పుల్లో కాల్చడం సాధ్యం కాదు. అందుకే వాటిని ఉడకబెట్టి తీసుకొస్తాం. కొంచెం ముదిరితే కాల్చి తీసుకొస్తాం. ఉడకబెట్టినవి తెస్తే కాల్చినవి కావాలంటారు. కాల్చినవి తెస్తే ఉడకబెట్టినవి కావాలంటారు.

–తిరుపతమ్మ, మోర్లవారిపాళెం, కావలి మండలం

క్లుప్తంగా

చలికోటుల వితరణ



కావలి: రుద్రకోటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు మోజెస్ రత్నాకర్, పింకీ దంపతులు చలికోటులను బుధవారం వితరణ చేశారు. తమ కుమారుడి పుట్టిన రోజును పురస్కరించుకుని చలికోటులను వితరణ చేసినట్లు వారు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం పీ శ్రీనివాసులు, ఎం సుదర్శనం పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దుత్తలూరు: నర్రవాడ గిరిజన కాలనీలోని గిరిజనులకు ఆర్థిక అక్షరాస్యతపై నర్రవాడ ఏపీజీబీ మేనేజర్ నీలం నాగలక్ష్మి బుధవారం అవగాహన కల్పించారు. గిరిజనులు బ్యాంకు సేవలకు నోచుకోకపోవడాన్ని బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు ఏపీజీబీ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మేనేజర్ గిరిజనులతో నూతన బ్యాంకు ఖాతాలు తెరిపించి పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు అందజేసి వాటిపై అవగాహన కల్పించారు.

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

వరికుంటపాడు: మండలంలోని నార్త్ కొండాయపాళెం సర్పంచ్ కే రమణమ్మ చెక్ పవర్‌ను తాత్కాలికంగా మూడు నెలలపాటు రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎల్ శ్రీధర్‌రెడ్డి జారీచేసిన ఉత్తర్వులు మండల పరిషత్ కార్యాలయానికి బుధవారం అందాయి. గ్రామంలో నిర్మించిన సీసీరోడ్లకు సంబంధించి కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణకు బిల్లులు చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జెడ్పీ డిప్యూటీ సీఈఓ తనిఖీలు

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. మండల పరిషత్‌కు సంబంధించిన 36 రిజిష్టర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రసన్నకుమారి ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ సమావేశం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ త్వరలో నెల్లూరుకు మంద కృష్ణమాదిగ రానున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు కొందరు చేస్తున్న కుట్రలను మాదిగలు ఐక్యతగా ఉండి తిప్పికొట్టాలన్నారు. అనంతరం కొండాపురం మండల ఇన్‌చార్జిగా జీ సుధాకర్, జలదంకి మండల ఇన్‌చార్జిగా పందిటి అంబేడ్కర్‌ను ప్రకటించారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



మర్రిపాడు : మండల విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. దివ్యాంగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంపీడీఓ నాగేశ్వరవరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగుల్లోని అంతర్గత శక్తులను వెలికితీసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంఈఓలు జ్యోతి, ధనలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్ రఫీ, తదితరులుపాల్గొన్నారు.

మామిడికి బీమా గడువు పొడిగింపు

కావలి/ఆత్మకూరురూరల్: మామిడికి సంబంధించిను బీమా ప్రీమియం గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు కావలి, ఆత్మకూరు ఉద్యాన అధికారులు ఎం సుధామయి, రాజశేఖర్ తెలిపారు. కావలి మండలం సిరిపురం, చలంచర్ల, ఆత్మకూరు మండలం అప్పారావుపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడికి ఎకరాకు రూ.2,250 చెల్లిస్తే ప్రకృతి విపత్తులతో నష్టపోతే రూ.45వేల వరకు నష్టపరిహారం అందుతుందని తెలిపారు. వీహెచ్ఏ రేణుకారెడ్డి, వీఏఏ బలరాం పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


గోదాములో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ బీ పావని

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఎరువుల దుకాణాలను ఆర్డీఓ పావని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి స్టాక్ నిల్వలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని డీలర్లకు సూచించారు. కొందరు డీలర్లు తాము చెప్పిన మందులు కొంటేనే రైతులకు అవసరమైన ఎరువులు ఇస్తామని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి నిబంధనలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మాజీ సర్పంచ్‌పై దాడి

వరికుంటపాడు: మండలంలోని కృష్ణంరాజుపల్లె మాజీ సర్పంచ్ పీ శ్రీనివాసులుపై విరువూరుకు చెందిన బాలనారాయణరెడ్డి అనే వ్యక్తి బుధవారం కర్రతో దాడికి పాల్పడ్డాడు. శ్రీనివాసులు విరువూరు వద్ద ఉన్న పొలంలోకి వెళుతుండగా బాలనారాయణరెడ్డి కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘునాథ్ తెలిపారు.

మాజీ చైర్మన్ గ్రంధికి నివాళి

కావలి: మున్సిపల్ మాజీ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో పాటు పులువురు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నోటి ప్రసాద్‌రెడ్డి అన్నదానం చేశారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు

కావలి: కావలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం ఆయన కావలిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల కావలి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కావలి టౌన్, కావలి రూరల్, బోగోలు, జలదంకి మండలాల్లో అనధికారిక మద్యం విక్రయాలపై దాడులు జరిపి 47 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. 628 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు వివరించారు.కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురంలో బుధవారం కోడూరు పెద పోలయ్య అనే వ్యక్తి 15 మద్యం సీసాలు అక్రమంగా కలిగి ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చలంచర్ల పంచాయతీ పరిధిలోని చలంచర్ల, పేపర్లవారిపాళెం గ్రామాల్లో ఐదుగురి నుంచి 54 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు వివరించారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న 19 మందిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఎవరైనా అనధికారింగా మద్యం, నాటుసారా విక్రయాలు చేస్తుంటే 94409 2521, 99593 31263 నంబర్లకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం


అర్జీని పరిశీలిస్తున్న కావలి ఆర్డీఓ వంశీకృష్ణ

వింజమూరు(ఉదయగిరి): భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కావలి ఆర్డీఓ వంశీకృష్ణ తెలిపారు. వింజమూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. భూసమస్యలపై అర్జీలను స్వీకరించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ హమీద్, ఆర్ఐ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, సర్పంచ్ ఎన్ సుజన, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 12 అర్జీలు

సీతారామపురం: మండలంలోని జయపురంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. భూసమస్యలపై 12 అర్జీలు అందినట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపుతామన్నారు. గురువారం సీతారామపురం బిట్–1 సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరు: మండలంలోని నార్త్‌మోపూరు గ్రామసచివాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ప్రభుదీప్ పాల్గొన్నారు.

వరికుంటపాడు: దామంచర్ల,డక్కునూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ హేమంత్ కుమార్,డీటీ చెంచయ్య భూసమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఆర్ఐ యశ్వంత్‌కుమార్,సర్వేయర్ విష్ణు,వీఆర్వో మనోహర్ పాల్గొన్నారు.

వెన్నవాడలో వైద్యశిబిరం



ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడలో విషజ్వరాలు ప్రబలడంతో వైద్యారోగ్య సిబ్బంది బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. గత వారం రోజులుగా గ్రామానికి చెందిన పలువురు వైరల్ జ్వరాలతో బాధపడుతూ ఆత్మకూరులోని ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి జ్వరపీడితులకు వైద్యసేవలు అందించారు. ఇంటింటికి తిరిగి లార్వా సర్వే, రక్తపరీక్షలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సైదా, పీహెచ్‌ఓలు సుప్రియ, గాయత్రి, ఏఎన్‌ఎం భూదేవి, తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమష్టి కృషి



అనుమసముద్రంపేట: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు పేదరిక నిర్మూలన, అందరికి ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, సామాజిక న్యాయం, లింగ సమానత్వం, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎంపీఈఓ ప్రసన్నకుమారి, విస్తరణాధికారి రమేష్, ఏపీఎం సతీష్, అంగన్‌వాడీలు కస్తూరి, విజయలక్ష్మి, పీఆర్ ఏఈ ఖాదర్‌మస్తాన్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


ఆత్మకూరు: ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలో లేనంత మాత్రాన కార్యకర్తలు అధైర్యపడొద్దని అండగా ఉంటామని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆత్మకూరులోని మేకపాటి కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అప్రతిష్ఠ తెచ్చుకున్న ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వ రికార్డు సృష్టించిందని, ప్రజలు సైతం ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి తరువాత పార్లమెంట్ నియోజకవర్గాల్లో పరిస్థితిని బట్టి రెండు నుంచి మూడు రోజుల పాటు ఉండి కార్యకర్తలు, నాయకులతో సమావేశం కానున్నారని తెలిపారు. సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి తిరిగి పార్టీ పూర్వవైభవం సాధించేలా కృషి చేద్దామన్నారు. ఆయన పర్యటన ప్రారంభానికి ముందే జిల్లాలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటికి అనుబంధ కమిటీలను చురుకుగా ఉండే కార్యకర్తలతో ఏర్పాటు చేసేందుకు త్వరలోనే నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, వారికి అవసరమైన న్యాయపరమైన సహకారం అందించేందుకు పార్టీ ముందుంటుందన్నారు. గత ప్రభుత్వకాలంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకుండా అవరోధాలు సృష్టిస్తే తన దృష్టికి తీసుకురావాలని, న్యాయపరంగా పోరాడి సాధించుకుందామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేదాక వైఎస్సార్‌సీపీ కింది స్థాయి నుంచి పోరాటాలకు సిద్ధమన్నారు. ఈ నెల 13న నిర్వహించిన అన్నదాతకు అండగా కార్యక్రమం విజయవంతమైందన్నారు. అదే విధంగా ఈ నెల 27న విద్యుత్ చార్జీల పెంపుపై నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మేకపాటిని పలువురు శాలువాలతో సన్మానించారు. అనంతరం మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్‌బేగం, సయ్యద్ జమీర్ దంపతుల కుమారుడు జహీర్ ఇటీవల అనారోగ్యంతో చెన్నైలోని ఆస్పత్రి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. జహీర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఎస్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ కేవీ శ్రావణ్‌కుమార్, చేజర్ల ఎంపీపీ టీ విజయభాస్కర్‌రెడ్డి, బట్టేపాడు సొసైటీ చైర్మన్ బీ రవికుమార్‌రెడ్డి, డాక్టర్ జే ప్రణీత్, కౌన్సిలర్లు కామాక్షయ్యనాయుడు, పీ పెంచలయ్య, విజయజ్యోతి, కే స్వరూపరాణి, జీ సంధ్య, కె తిరుపతమ్మ, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్ కుమార్‌రెడ్డి, ఎస్ సుందర రామిరెడ్డి, పూనూరు రమేష్‌రెడ్డి, బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, కేతా రవి, కలాం, వీ లక్ష్మీరెడ్డి, బాలఅంకయ్య పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ముజీబ్, తూమాటి విజయ్‌భాస్కర్‌రెడ్డి, జమ్రు, తదితరులు ఉన్నారు.


చేజర్ల: పుల్లారెడ్డిని పరామర్శస్తున్న విక్రమ్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కమిటీలు

చేజర్ల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చురుకుగా పనిచేసే వారితో త్వరలో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఆదూరుపల్లిలోని జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి నివాసంలో కొద్దిసేపు పార్టీ శ్రేణులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

పరామర్శ

గాలిపాళేనికి చెందిన పోలంరెడ్డి పుల్లారెడ్డి కుమారుడు పోలంరెడ్డి విజయశంకర్‌రెడ్డి ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో పోలంరెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, వైస్‌ఎంపీపీ వేలూరు తిరుపతి నాయుడు, యనమదల సర్పంచ్ సుందర రామిరెడ్డి నాయకులు పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి,బీ సుధాకర్‌రెడ్డి, కృష్ణవేణి, వెంకటకృష్ణ , శ్రీను, మురళీకృష్ణ, రఘురామిరెడ్డి, ఎర్రగుంట పెంచలయ్య, పెంచలరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగం దేశానికి వెన్నుముక అని, కోవిడ్ సమయంలో అన్ని రంగాలు మూతపడినా రైతులు కష్టపడి దేశానికి ఆహారం అందించారని గుర్తుచేశారు. విద్యార్థులు తమ ఊహాలను పునర్నిర్మించుకోవడానికి వ్యవసాయ కోర్సులు ఎంతో దోహదపడుతాయన్నారు. సీనియర్ విద్యార్థుల నుంచి జూనియర్లు సలహాలు తీసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరూ స్నేహంగా మెలగాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాశాల అసోసియేట్ డీన్ జీ కృష్ణారెడ్డి, ఆత్మ పీడీ శివన్నారాయణ, ఏడీఏ చెన్నారెడ్డి, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపును పాటించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

కావలి: విద్యుత్ పొదుపును ప్రతిఒక్కరూ పాటించాలని కావలి విద్యుత్ శాఖ ఈఈ కేఎస్ బెనర్జీ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా కావలిలో విద్యుత్ శాఖ కార్యాలయం నుంచి ఉదయగిరి బ్రిడ్జి కూడలి వరకు విద్యుత్ సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ బెనర్జీ మాట్లాడుతూ ఇంధన వనరులను విచ్చలవిడిగా వాడడం వల్ల భావితరాల మనుగడకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. అందువల్ల విద్యుత్ వృథాను ప్రతిఒక్కరూ అరికట్టాలన్నారు. సౌరవిద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కావలి, కలిగిరి డీఈలు ఏ రవికుమార్, టీ కృష్ణమోహన్‌బాబు, కావలి ఏఈలు వై వసంతరావు, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, అల్లూరు, బోగోలు, దగదర్తి ఏఈలు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నెల్లూరులోని తన నివాసంలో ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘాల కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3649 సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వగా, 3,553 సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయన్నారు. సోమశిల, పెన్నాడెల్టా, కనుపూరుకాలువ, గండిపాళెం, రాళ్లపాడు, వీఆర్‌కోట ప్రాజెక్ట్ కమిటీలకు ఈనెల 21న అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులు మొదలయ్యాయని, ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. పెన్నా వరదలకు దెబ్బతిన్న సోమశిలలోని సోమేశ్వర ఆలయాన్ని రూ.9 కోట్లతో పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. మర్రిపాడు మండలం వెంకటాపురంలో జీకా వైరస్ లక్షణాలు ఉన్న బాలుడిని గుర్తించామని, అతనికి మెరుగైన చికిత్స అందించేలా వైద్యులను ఆదేశించామన్నారు. గ్రామంలోనూ వైద్యశిబిరం నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి ఆనం తెలిపారు. తాళ్లూరి గిరి నాయుడు, కే రవీంద్రారెడ్డి, జిల్లా ఇరిగేషన్ శాఖ, సోమశిల ప్రాజెక్ట్ అధికారులు దేశ్‌నాయక్, ఎంపీ రమణారెడ్డి, బీవీ రమణారెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.